క్లుప్తంగా

19న ముత్తుస్వామి దీక్షితార్ వర్ధంతి

బోట్‌క్లబ్: నాదజ్యోతి ముత్తుస్వామి దీక్షితార్ వర్ధంతి సందర్భంగా స్థానిక సూర్యకళా మందిరంలో వచ్చే నెల 19న సాయంత్రం స్థానిక విద్యాంసుల ఆధ్వర్యంలో ముత్తుస్వామి దీక్షితార్ కృతుల గానం నిర్వహిస్తున్నట్లు ప్రముఖ గాయని పెద్దాడ సూర్యకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహేంద్రవాడ నరసింహమూర్తి శిష్యులు, చిలుకూరి సుబ్బలక్ష్మి శిష్యులు, ప్రభల రాజేశ్వరి శిష్యులు, ఎం విజయకుమారి, చావలి సూర్యకుమారి శిష్యుల గాత్ర కచేరీ జరుగుతుందని వివరించారు. అనంతరం షేక్ సుభాని సాహెబ్, పసుపులేటి వేంకటరమణ, షేక్ రెహమాన్, రాయుడు బ్రదర్స్, షేక్ నజీర్ నాదస్వర కచేరీ జరుగుతుందన్నారు. కార్యక్రమానికి సంగీతాభిమానులు హాజరుకావాలని కోరారు.

ఎంపికైన పీఈటీకి సత్కారం



రాజబాబును సత్కరిస్తున్న గ్రామస్తులు

కరప: యండమూరు గ్రామానికి చెందిన గుర్రాల రాజబాబు ఇటీవల వెలువడిన డీఎస్సీ ఫలితాల్లో పీఈటీ పోస్టు సాధించారు. పీఈటీ ఉద్యోగం సాధించిన రాజబాబును సోమవారం సాయంత్రం గ్రామానికి చెందిన ఉద్యోగులు మార్రెళ్ల సర్వేశ్వరరావు, మార్రెళ్ల రాఘవులు, గుబ్బల రాంబాబు, పేర్రెళ్ల చంద్రరావు, బొమ్మిరి ఏసురత్నం, కోరం జాన్సన్, మార్రెళ్ల శ్రీధర్, ఐ.అనూరాధ, గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రాజబాబు మాట్లాడుతూ, తన తండ్రి పడిన కష్టాన్ని చూసి, ఎలాగైనా ప్రభుత్వోద్యోగం సాధించి, తల్లిదండ్రుల రుణం తీర్చుకోవాలన్న తపనతో ఏడాదిగా కష్టపడ్డానన్నారు. ఇందుకు సహకరించిన వారికి, సన్మానం చేసిన గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు.

పీహెచ్‌సీల్లో జీఎస్టీ 2.0పై హెల్ప్ డెస్కులు



అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్‌వో

కాకినాడ క్రైం: ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్‌పై హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేసినట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహ నాయక్ తెలిపారు. జీఎస్టీ 2.0లో భాగంగా సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్‌పై జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ విస్తృత ప్రచారం చేపట్టింది. జీఎస్టీలో చోటుచేసుకున్న మార్పుల వల్ల రోగులకు అందే వైద్యపరమైన ప్రయోజనాలపై డీఎంహెచ్‌వో స్థానిక జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ప్రాణ రక్షణ మందులు దిగుమతి చేసుకునే అరుదైన వ్యాధుల ఔషధాలు, డయాగ్నోస్టిక్ కిట్ల ధరలు గణనీయంగా తగ్గనున్నాయన్నారు. కార్యక్రమంలో పలువురు వైద్యాధికారులు పాల్గొన్నారు.

తల్లికి పాప అప్పగింత



శ్రీపీఠంలో తప్పిపోయిన పాప

కాకినాడ రూరల్: దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకుని శ్రీపీఠంలో సరస్వతీ పూజలకు సోమవారం భారీగా విద్యార్థులు, చిన్నారులు తరలివచ్చారు. సుమారు మూడేళ్ల పాప తప్పిపోయి ఏడుస్తూ కనిపించడంతో, స్థానికుల సమాచారం మేరకు సర్పవరం సీఐ పెద్దిరాజు, ఎస్సై శ్రీనివాసకుమార్ స్పందించారు. మైక్ అనౌన్స్‌మెంట్ చేసి ఆ పాపను తల్లి చెంతకు చేర్చారు. రాజమండ్రికి చెందిన తల్లి పోలీసులకు ధన్యవాదాలు తెలిపింది.

సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించాలి



స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎంపీ, కలెక్టర్, ఎమ్మెల్సీ తదితరులు

కాకినాడ రూరల్: ప్రతి ఒక్కరూ దేశ సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించేందుకు హస్తకళలను ప్రోత్సహించాలని ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ అన్నారు. సోమవారం కాకినాడ శిల్పారామంలో కేంద్ర ప్రభుత్వ హస్తకళల సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గాంధీ శిల్ప బజార్‌ను ఆయన ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కలెక్టర్ షణ్మోహన్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. నగర ప్రజలకు గాంధీ శిల్ప బజార్‌లో వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారులు తయారు చేసిన కళాకృతులు గొప్ప అనుభూతిని కలుగజేస్తాయని ఎంపీ తెలిపారు. కార్యక్రమంలో ఓఎన్‌జీసీ రాజమహేంద్రవరం చీఫ్ జనరల్ మేనేజర్ ఆర్ఎస్ రామారావు, ఏపీఐటీసీవో వైస్ ప్రెసిడెంట్ ఐఎస్ రావు, కేంద్ర హస్తకళల శాఖ ఏడీ అపర్ణలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పూడ్చివేతలు

- పిఠాపురం రోడ్డులో కంకర బూడిదతో గతుకుల మరమ్మతులు
- పైకి తేలిన కంకర రాళ్లు
- జారిపడుతున్న ద్విచక్ర వాహనదారులు
- ఆందోళన చేసినా పట్టించుకోని అధికార యంత్రాంగం



బైక్ జారిపడడంతో గర్భిణి గాయపడిన ప్రాంతమిదే..



రాయుడుపాలెం జంక్షన్ సమీపంలో ప్రమాదకరంగా మారిన పిఠాపురం రోడ్డు

కాకినాడ రూరల్: కొండ నాలుకకు మందు వేస్తే.. ఉన్న నాలుక ఊడిన చందంగా ఉంది రహదారి మరమ్మతుల పనులు. నిత్యం రద్దీగా ఉండే కాకినాడ–పిఠాపురం రోడ్డులో కాకినాడ రూరల్ రాయుడుపాలెం జంక్షన్ సమీపంలో భారీ గోతులు ఏర్పడ్డాయి. దీనిపై ఆగస్టు 15న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి.. భారీ గోతుల్లో కంకర బూడిద(ఫ్లై యాష్) వేసి సరిపెట్టారు. ఇదే ప్రయాణికుల పాలిట శాపంగా మారింది. నిత్యం వివిధ పనుల కోసం కాకినాడకు వచ్చే వారు తిరుగు ప్రయాణంలో ఈ మార్గంలో వెళతారు. బూడిద లేచి, కంకర రాళ్లు రోడ్డుపై చేరడంతో ద్విచక్ర వాహనదారులు వాటిని గమనించకుండా వెళుతూ.. అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. పలు ప్రమాదాలు జరగడం, మోటార్ బైక్ వెనుక కూర్చున్న మహిళలు గాయాలపాలు కావడంతో, ఇటీవల ఈ ప్రాంతంలోని వివిధ దుకాణదారులు ఆందోళనకు దిగారు. ఫ్లెక్సీ చేతపట్టి.. రోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. అయినప్పటికీ సంబంధిత అధికారులు స్పందించలేదు. జిల్లా కలెక్టర్, వివిధ శాఖల ఉన్నతాధికారులు ఈ రోడ్డు మీదుగా పిఠాపురం, గొల్లప్రోలు, కత్తిపూడి, ప్రత్తిపాడు, అన్నవరం, తుని తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నప్పటికీ.. వారు కూడా పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారే ప్రమాదాలకు ఎక్కువగా గురవుతున్నారు. కార్లలో ప్రయాణించే వారికి ఈ సమస్య తీవ్రత తెలియడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. ఇటీవల కాకినాడకు వైద్యం కోసం వెళ్తూ.. ఈ గతుకుల్లో పడి ఓ గర్భిణి గాయపడిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎక్కువగా తిమ్మాపురం, సామర్లకోట మండలం అచ్చంపేట, పనసపాడు తదితర గ్రామాలు, పిఠాపురం పట్టణ, పరిసర గ్రామాల వారు బైక్‌లపై వెళుతున్నందున, వారి భద్రతను దృష్టిలో పెట్టుకుని తాత్కాలిక మరమ్మతులు కాకుండా.. శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టి రోడ్డు సమస్య తీర్చాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ప్రమాద సంఘటనలు



మా షాపు సమీపంలోనే రోడ్డుపై గుంతలు పూడ్చేందుకు బూడిద కంకర వేశారు. దానివలన ప్రమాదాలు జరుగుతున్నాయి. స్కూటీలు, బైక్‌లపై వెళుతున్న వారు ఐదారు సంఘటనల్లో జారి పడిపోయారు. ఓ గర్భిణి కిందపడడంతో భయపడ్డాం.

– లక్ష్మీసాయి, దుకాణ వర్కర్, రాయుడుపాలెం

శాశ్వత పరిష్కారం అవసరం



రోడ్డు సమస్య పరిష్కరించాలని ఆందోళన చేశాం. గుంతలు పూడ్చి బూడిద పైకి వచ్చేలా పనులు చేశారు. దుమ్ము పైకి లేచిపోవడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. తక్షణం శాశ్వత పరిష్కారం చేసి, సమస్యను పరిష్కరించాలి.

– సూర్యనారాయణ, వ్యాపారి, రాయుడుపాలెం జంక్షన్

వైఎస్సార్ సీపీ వాకలపూడి అధ్యక్షుడిగా బొడ్డు శ్రీను



బొడ్డు శ్రీనును అభినందిస్తున్న కన్నబాబు

కాకినాడ రూరల్: వైఎస్సార్ సీపీ వాకలపూడి గ్రామ కమిటీ అధ్యక్షుడిగా పార్టీ గ్రామ నాయకుడు బొడ్డు శ్రీను నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ మంత్రి కురసాల కన్నబాబు సోమవారం ప్రకటించారు. అనంతరం గ్రామ నాయకుల సమక్షంలో బొడ్డు శ్రీనును రమణయ్యపేట వైద్యనగర్ క్యాంప్ కార్యాలయంలో అభినందించారు. కార్యక్రమంలో పార్టీ వాకలపూడి గ్రామ నాయకులు సంగాడి మోషే, కరీం బాషా, సుబ్బారావు, గొల్లపల్లి జగన్, కాశీ, నల్ల రాణి, శ్రీను, విజయసారధి, నున్న వెంకటేశ్వరరావు, గంపల సత్యనారాయణ, వీర్రాజు, గోపి, అప్పారావు, కడియాల రాజు, ప్రసన్న, రాజ్‌కుమార్, కర్రి చక్రధర్, సయ్యద్ వలీ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులను ఆశ్రయించిన బాధితులు



గంగనాపల్లిలో కూల్చివేసిన షెడ్

కాకినాడ రూరల్: తమ షెడ్ కూల్చివేయడంతో పాటు దాడికి పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలంటూ మండలంలోని గంగనాపల్లి గ్రామానికి చెందిన బాధితురాలు ముప్పిడి బాబ్జీ, ఆమె భర్త ఉదయ్‌కుమార్ ఇంద్రపాలెం పోలీసులను ఆశ్రయించారు. 2017లో గంగనాపల్లిలో 12 సెంట్ల స్థలం కొనుగోలు చేసుకుని అందులో షెడ్ నిర్మించుకున్నామని బాధితులు పేర్కొన్నారు. సరిహద్దులో ఉన్న వ్యక్తులు ఇబ్బందులు పెట్టడంతో కోర్టును ఆశ్రయించామని చెప్పారు. కోర్టు తమకు అనుకూలంగా తీర్పు ఇవ్వడంతో పోలీసుల సమక్షంలో గతంలో షెడ్ స్థలం అప్పగించారన్నారు. షెడ్‌ను ఈ నెల 26న కూల్చివేశారని, దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. దీనిపై ఇంద్రపాలెం ఎస్సై వీరబాబు మాట్లాడుతూ, ఘటనపై ఫిర్యాదు అందిందన్నారు. దీనిని పరిశీలించి, కేసు నమోదు చేస్తామన్నారు.

ఎంఎస్ఎంఈలతో మహిళల ఆర్థికాభివృద్ధి



సమావేశంలో అవగాహన కల్పిస్తున్న శ్రీనివాసరావు



హాజరైన మహిళాశక్తి సంఘాల సభ్యులు

కరప: మహిళలు స్వశక్తితో ఆర్థికాభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకుని, ఎంఎస్ఎంఈ(మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్) పారిశ్రామిక యూనిట్లు ఏర్పాటు చేసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎస్‌వీ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక స్త్రీ శక్తి భవనంలో సోమవారం మహిళాశక్తి సంఘాల సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో స్థాపించే నూతన పరిశ్రమలకు కొత్త పాలసీ అమలవుతోందన్నారు. ప్రధానమంత్రి ఉపాధి కల్పనా పథకం, విశ్వకర్మ పథకం, ఏపీ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ, ఏపీ ఫుడ్ ప్రోసెసింగ్, ఏపీ టెక్స్‌టైల్స్, ఏపీ ఇండస్ట్రియల్ పార్క్, ఏపీ టూరిజం వంటి పాలసీలు అమలు కానున్నాయని వివరించారు. అలాగే పేద, మధ్యతరగతి వర్గాల వారికి ప్రతి కుటుంబానికి రూ.15 వేలు ఆదా అయ్యేలా జీఎస్టీ తగ్గించారన్నారు. ఏపీఎం ఎంఎస్‌బీ దేవి మాట్లాడుతూ, మహిళాశక్తి సంఘాల సభ్యులు ఎంఎస్ఎంఈ యూనిట్లు నెలకొల్పాలనుకునేవారు ముందుగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఏ యూనిట్లకు ఎంతవరకు రాయితీ వస్తుందో అవగాహన కల్పించారు.

గందరగోళం మధ్య ముగిసిన మహాజన సభ



మహాజన సభలో ఆందోళన చేస్తున్న సొసైటీ బాధితులు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): అరుపులు, కేకల మధ్య గందరగోళ పరిస్థితులు నెలకొనడంతో ది జయలక్ష్మి సొసైటీ మహాజన సభ అర్ధంతరంగా ముగిసింది. స్థానిక దంటూ కళాక్షేత్రంలో సోమవారం సొసైటీ 4వ మహాజన జరిగింది. సొసైటీ చైర్మన్ త్రినాథరావు సమావేశంలో 7 తీర్మానాలు, 10 సవరణలను ప్రవేశపెట్టారు. దీనికి వ్యతిరేకంగా సభ్యులు ప్రస్తుతం ఉన్న కమిటీని మొత్తం రద్దు చేయాలని, కమిటీని నియమించి మూడేళ్లు గడుస్తున్నా తమకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని బాధితులు మండిపడ్డారు. జిల్లా సహకార శాఖ అధికారులు సైతం పాలకవర్గానికి మద్దతు పలుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మహిళా సభ్యులు మాట్లాడుతూ, తాము చాలా నిరుపేదలమని, కష్టపడి దాచుకున్న సొమ్ము ఎక్కువ వడ్డీకి ఆశపడి ఈ బ్యాంకులో డిపాజిట్లు చేశామన్నారు. సభకు పరిశీలకుడిగా వచ్చిన జిల్లా సహకార అధికారి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, బాధితులకు అన్ని విధాలా న్యాయం చేస్తామని, కానీ కొందరు సభ్యులు తమపై నిందలు వేయడం తగదన్నారు. ఉన్నతాధికారుల సూచనలు మేరకు ఇక్కడకు వచ్చామని, ఇక్కడ జరిగిన విషయాలను జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులకు నివేదిస్తానన్నారు. కలెక్టర్ ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారన్నారు. తీర్మానాలు, సవరణలు ఆమోదం పొందకుండానే మహాజన సభ ముగుస్తున్నట్లు ప్రకటించారు. సమావేశం అనంతరం పలువురు బాధితులు గాంధీభవన్‌లో సమావేశమయ్యారు. తదుపరి కార్యాచరణ రూపొందించుకునేందుకు తీర్మానించారు. ఈ సమావేశంలో బాధితులు, సంఘ నాయకులు ఈరంగి రఘుభూషన్, గోదావరి చక్రవర్తి, ప్రసాదరావు, గొల్లపల్లి వెంకటరత్నం, అప్పాజీ పాల్గొన్నారు.

గుండె ఆరోగ్యంపై అవగాహన ర్యాలీ



కాకినాడలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కాకినాడ రూరల్: వరల్డ్ హార్ట్ డే సందర్భంగా కాకినాడ మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్యులు, సిబ్బంది, వివిధ స్వచ్ఛంద సంస్థలకు చెందిన వారు సోమవారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. భానుగుడి జంక్షన్ వద్ద అవగాహన ర్యాలీని ఆస్పత్రి యూనిట్ హెడ్ శుభాకరరావు ప్రారంభించారు. టూటౌన్, సీఎంఆర్, నూకాలమ్మ గుడి మీదుగా తిరిగి భానుగుడి వరకు సైకిల్ ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా గుండె సంబంధ వైద్య నిపుణులు నరేష్, చెన్న కేశవ తదితరులు గుండె వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

గుండెపోటుకు వయసుతో సంబంధం లేదు

కాకినాడ క్రైం: వయసుతో గుండెపోటుకు నిమిత్తం లేదని, చిన్న వయస్సులోనూ సంభవించవచ్చని కాకినాడకు చెందిన పలువురు హృద్రోగ నిపుణులు అన్నారు. సోమవారం వరల్డ్ హార్ట్ అటాక్ డే సందర్భంగా స్థానిక అపోలో యాజమాన్యం ఆధ్వర్యంలో ఆస్పత్రి ఆవరణలో వాక్‌థాన్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చిన్న వయస్సు నుంచి గుండె ఆరోగ్యానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆస్పత్రి రీజనల్ సీఓఓ డాక్టర్ ఆర్ఆర్ రెడ్డి, కాకినాడ జిల్లాకు చెందిన కార్డియాలజిస్ట్‌లు తంగెళ్ల వెంకటేశ్వరరావు, గొల్లపల్లి సాజిద్‌కిషన్, ప్రశాంతి మాట్లాడుతూ, గుండెనొప్పి లక్షణాలను వివరించి, ఆ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సరైన సమయంలో వైద్యం పొందడం ద్వారా మరణాల శాతాన్ని తగ్గించవచ్చన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గాదేవి ఆలయాల్లో భక్తుల కిటకిట

సామూహిక సరస్వతీదేవి పూజలు




పెనుగుదురు విష్ణాలయంలో పూజలు చేస్తున్న విద్యార్థులు



కరప శివాలయంలో సరస్వతీదేవి పూజలు చేయిస్తున్న అర్చకుడు



సూర్యారావుపేటలో రక్తబీజాక్షుని వధ అలంకరణలో..



కనకదుర్గ అలంకరణలో దేవాలయం వీధిలోని బాలాత్రిపుర సుందరి



కాకినాడ భానులింగేశ్వరస్వామి ఆలయంలో సరస్వతీదేవి అలంకరణలో..



కరప శివాలయంలో రక్తబీజాక్షుని వధ అవతారంలో పర్వతవర్ధినీదేవి

బోట్‌క్లబ్: దసరా ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారు వివిధ అలంకరణల్లో భక్తులకు దర్శనమిచ్చారు. మూల నక్షత్రం కావడంతో ఆలయంలో సామూహిక సరస్వతీ పూజలు నిర్వహించారు. దీంతో విద్యార్థులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయాలు కిక్కిరిశాయి. పూజల అనంతరం అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్థానిక బాలాత్రిపుర సుందరి ఆలయంలో అమ్మవారు రక్తబీజాక్షుని వధ అలంకరణలో దర్శనమిచ్చారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా బాలాత్రిపుర సుందరి భజన మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన భక్తి కీర్తనలు, కోలాటం భక్తులను ఆకట్టుకున్నాయి. శ్రీ జ్యోతి నృత్య కళానికేతన్‌కు చెందిన కళాకారుల శాస్త్రీయ నృత్యం అలరించింది. మూలా నక్షత్రం సందర్భంగా ఆలయంలో సామూహిక సరస్వతీ పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. స్థానిక దేవాలయం వీధిలోని బాలాత్రిపుర సుందరి సమేత భీమేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు కనకదుర్గ అలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయంలో అన్న సమారాధన నిర్వహించారు. ఆలయంలో సామూహిక సరస్వతీ పూజలు జరిగాయి. విద్యార్థులకు ఉచితంగా పెన్నులు, పుస్తకాలు పంపిణీ చేశారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ ఈఓ రాపర్తి రాజేశ్వరరావు ప్రత్యేక చర్యలు చేపట్టారు. స్థానిక మాధవనగర్‌లోని కనకదుర్గ ఆలయంలో అమ్మవారు సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. చిన్నారులతో ఆలయ ప్రధానార్చకుడు సూర్యనారాయణ సరస్వతీ పూజలు చేయించారు. కుంకుమ పూజల్లో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. స్థానిక రిజర్వులైన్ అయ్యప్పస్వామి ఆలయంలో అమ్మవారు సరస్వతీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. స్థానిక అశోక్‌నగర్ సాయిబాబా మందిరంలో శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా చండీ హోమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వేదుల అచ్యుతరామారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో సరస్వతీ పూజలు నిర్వహించారు. స్థానిక భానుగుడి భానులింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. విద్యార్థులు సరస్వతీ పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ఈఓ వరపల్లి శ్రీనివాసరావు పెన్నులు, పుస్తకాలు పంపిణీ చేశారు.

అమ్మవారికి కుంకుమార్చనలు

కరప: శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు సోమవారం మండలంలోని వివిధ గ్రామాల్లో దుర్గాదేవి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. దుర్గాదేవిని ప్రత్యేకంగా అలంకరించి, భక్తిశ్రద్ధలతో పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. పేపకాయలపాలెం, అరట్లకట్ట, వాకాడ, కూరాడ, నడకుదురు, పాతర్లగడ్డ, గొర్రిపూడి, కొంగోడు, పెద్దాపురప్పాడు, వేళంగి, వేములవాడ, వలసపాకల, కొరుపల్లి, జెడ్.భావారం, గొడ్డటిపాలెం తదితర గ్రామాల్లోని దుర్గాదేవి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అమ్మవారికి కుంకుమార్చన చేశారు. కరప దుర్గాదేవి ఆలయంలో వేకువజాము నుంచే మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి కుంకుమ పూజ చేయించుకున్నారు. అమ్మవారికి కరప అర్చకులు కొంపెల్ల చక్రధర్ పూజాదికాలు నిర్వహించగా, వేద పండితులు కుంకుమార్చనలు చేశారు. పెనుగుదురు సంతోషిమాత ఆలయంలో అర్చకులు కాదా సత్యనారాయణ అమ్మవారికి పూజలు నిర్వహించారు. కరపలోని విష్ణాలయంలో ప్రధానార్చకులు పెద్దింటి అనంతాచార్యులు, శివాలయంలో పర్వతవర్ధినీదేవిని రక్తబీజాక్షుని వధ అవతారంగా అలంకరించారు. ప్రధానార్చకుడు విలపర్తి శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేశారు. కరప చింతపల్లి రోడ్డులోని విజయదుర్గాదేవి ఆలయంలో అమ్మవారికి పూజలు నిర్వహించారు.

ప్రత్యేక పూజలు

శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా పెనుగుదురు వేణుగోపాలస్వామి ఆలయంలో దేవదాయ శాఖ, సరస్వతీ బాలభక్త యువజన సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులతో అర్చకుడు గోవర్ధనం సూర్యనారాయణాచార్యులు సామూహిక సరస్వతీదేవి పూజ చేయించారు. ఈఓ అపర్ణ, పలువురు గ్రామస్తులు విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్లు పంపిణీ చేశారు. కరప శివాలయంలో అర్చకుడు విలపర్తి శ్రీనివాస్, యండమూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకుడు పెద్దింటి సీతారామం విద్యార్థులతో సరస్వతీదేవి పూజలు చేయించారు.

భీమేశ్వరస్వామి ఆలయంలో సరస్వతీ పూజల్లో పాల్గొన్న విద్యార్థులు



ఘనంగా సరస్వతీ పూజ



పూజల్లో పాల్గొన్న విద్యార్థులు

బాలాజీచెరువు: నగరంలోని బాలాజీ చెరువు సెంటర్ దుగ్గిరాలవారి వీధిలో వేంచేసిన శ్రీకనకదుర్గమ్మ ఆలయంలో సోమవారం సరస్వతీ పూజ నిర్వహించారు. శరన్నవరాత్రుల్లో భాగంగా విద్యార్థులతో సరస్వతీ పూజ జరిపించారు. పురోహితులు సాలగ్రామ విశ్వనాథ శాస్త్రి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది.

మున్సిపల్ ఆస్తులపై నిర్లక్ష్యం తగదు

వాడీవేడిగా పెద్దాపురం కౌన్సిల్ సమావేశం

పెద్దాపురం: రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన మున్సిపల్ వాహనాలు సక్రమంగా వినియోగించకపోవడంతో.. మూలకు చేరి తుప్పు పట్టినా పట్టించుకోవడం లేదని, మున్సిపల్ ఆస్తులపై అధికారులకు ఇంత నిర్లక్ష్యం తగదని కౌన్సిల్ సభ్యులు మండిపడ్డారు. పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం సోమవారం మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సీనియర్ కౌన్సిలర్ విజ్జపు రాజశేఖర్ మాట్లాడుతూ, సుమారు రెండేళ్ల కిందట మున్సిపాలిటీకి శానిటరీ అభివృద్ధిలో భాగంగా వచ్చిన మోటార్ వెహికల్స్‌ని ప్రారంభించకుండా, వాడకుండా పక్కన పెట్టడం వల్ల వాహనాలు తుప్పు పట్టి, పాడైపోయాయన్నారు. వాటికి మరమ్మతులు చేసి వినియోగంలోకి తేవాలన్నారు. అలాగే మరమ్మతులకు గురైన ట్రాక్టర్లు, ఫాగింగ్ మెషీన్లనూ వినియోగంలోకి తీసుకురావాలన్నారు. కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి స్పందిస్తూ, సత్వరమే ఆయా వాహనాల మరమ్మతులకు చర్యలు చేపడతామన్నారు. కౌన్సిలర్ గోడేడ మరిడయ్య మాట్లాడుతూ, తమ వార్డులో బోర్‌వెల్ ఏర్పాటుపై అధికారుల నిర్లక్ష్యం తగదన్నారు. స్థలం మున్సిపాలిటీది కాదంటూ ఎవరో అంటే, ప్రజావసరమైన తాగునీటి సమస్యపై అధికారులు వారికి వంత పాడడమేమిటని నిలదీశారు. అవసరమైతే తాను సొంత ఖర్చులతో వార్డు ప్రజల దాహార్తిని తీరుస్తానంటే, బోర్‌వెల్ స్థలం మున్సిపాలిటీది కాదంటూ రాజకీయం చేయడం తగదన్నారు.